# రహదారిపై చిరు వ్యాపారాలు తొలగించాలి

**ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న వైనం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులు**



రహదారి పై ఏర్పాటు చేసిన దుకాణాలు తీసివేయాలని చిరు వ్యాపారులకు సూచిస్తున్న పోలీసు అధికారులు

మొయినాబాద్, ఫిబ్రవరి 22 : రహదారి వెంట ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులకు రోడ్డు ప్రమాదాలపై శనివారం పోలీసులు, మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. దుకాణాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రమాదాలు జరిగడంతో ప్రాణాలు కోల్పోతున్నారని వారు పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మొయినబాద్ మండల కేంద్రం నుంచి అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధి వరకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. మున్సిపల్ కమిషనర్ ఖాజామోయిజుద్దీన్, ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి దుకాణాలను సందర్శించి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. దుకాణాలకు వచ్చినప్పుడు వారి వాహనాలను రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తున్నారని, దీంతో రహదారిపైన వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులకు వివరించారు. రహదారి పక్కన దుకాణాలను తొలగించాలని, లేని పక్షంలో బలవంతంగా తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ప్రమాదం జరిగితేనే పోలీసులకు పట్టింపా..?**

ఇటీవల అమ్డాపూర్ చౌరస్తాలో భోజనం స్టాల్ వద్ద అన్నం తినేందుకని కారులో వచ్చిన వ్యక్తి కారు రోడ్డు పక్కన నిలుపగా, కారులో నుంచి దిగుతుండగా వెకాల నుంచి మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. భోజనం కోసమే కారు ఆపడం వలన కారు డ్రైవర్ మృతి చెందాడని, ఎవరైన చనిపోతే గాని పోలీసులు ఇలాంటి చర్యలకు పూనుకోరా అని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

## పేదల కల సహకారానికి కృషి

**ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 22: పేదల కల సహకారం చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన మోడల్ హౌస్ నిర్మాణం కోసం చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, నాయకులతో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు, అధికారులు ఉన్నారు.


## పాఠశాల అభివృద్ధికి విరాళం



పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

యాచారం, ఫిబ్రవరి22: మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి 1999-2000 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు రూ.37,000 శనివారం ప్రధానోపాధ్యాయురాలికి విరాళం అందజేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, కొండల్‌రెడ్డి, భోజయ్య, రాజు, నరేందర్‌రెడ్డి, పాషా, శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి




ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

యాచారం, ఫిబ్రవరి22: మధ్యాహ్న భోజన వర్కర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ చందూనాయక్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజన వర్కర్లు ఎంఈవో పాండురంగారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చందూనాయక్ మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వర్కర్లకు బిల్లులు చెల్లించకపోతే వారు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎలా వండి పెడుతారని ప్రశ్నించారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వారానికి మూడు రోజులు కోడి గడ్లను సరఫారా చేయాలని కోరారు. వర్కర్లకు క్రమం తప్పకుండా బిల్లులు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10,000 వేతనం ఇస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్లు నరసమ్మ, నాగమ్మ, అంసమ్మ, శిల్ప, లక్ష్మమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 22 : పెద్దోళ్ల పర్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్, యువ నాయకుడు పెద్దోళ్ల దయాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఈనెల 23వ తేదీన చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో టోర్నమెంట్ ప్రారంభిస్తున్నామని, ఎంట్రీ ఫీజు రూ.2500 అని, రోజూ రెండు మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుందన్నారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 22: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, గుర్తుంపు కార్డులు, యూనిఫామ్, సబ్బులు, నూనెలు, గ్లౌజులు, షూస్, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా పరిష్కారం చేస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

మణికొండ, ఫిబ్రవరి 22 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పరిష్కరించేందుకు కృషిచేస్తానని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురికాలనీలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా చిత్రపురి కాలనీ వాసులతో సమావేశమై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, రహదారుల ఇబ్బందులపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటేశం

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

**చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం**

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 22: మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని 15 వాహనాలను సీజ్ చేయగా, పెండింగ్‌చలాన్ ఉన్న 10 మంది వాహనదారుల నుంచి చలాన్ వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై జగదీశ్, ఏఎస్సై చంద్రనాయక్, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, మల్లేశ్, శ్రీశైలం, కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపయోగంగా నీటి ట్యాంక్

**సంగెం బీసీకాలనీలో తాగునీటి ఎద్దడి**



సంగెంలోని వాటర్‌ట్యాంక్

కేశంపేట, ఫిబ్రవరి 22: కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలోని బీసీకాలనీలో వేసవి ముందే తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నది. గ్రామంలోని బీసీకాలనీకి నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్ స్లాబ్‌పై భాగం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుందని, దీంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనన్న ఉద్దేశంతో ట్యాంక్‌కు నీటి సరఫరాను నిలిపివేశాని స్థానికులు చెబుతున్నారు. నీటిట్యాంక్‌కు నీటి సరఫరాను నిలిపివేయడంతో దాదాపు 100 కుటుంబాలకు తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. తాగునీటి ఎద్దడిని నివారణకోసం యువకులంతా ఏకమై ఇటీవల గతంలో తవ్విన ఓ బోరుగుంతను డ్రిల్ చేయించారని, ఆ బోరు మోటార్ ద్వారానే మూడు రోజులుగా బీసీకాలనీకి నీరందుతుందన్నారు. 25ఏళ్ల క్రితం నిర్మించిన నీటి ట్యాంక్ స్లాబ్ పై భాగానికి మరమ్మతులు చేసి బీసీకాలనీ నీటి సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## దుర్వాసన భరించలేం..

**మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపై పారుతున్న మురుగు నీరు పట్టించుకోని మున్సిపల్ అధికారులు**



మొయనాబాద్, ఫిబ్రవరి 22 : మొయినాబాద్ గ్రామంలో ఆశీర్‌ఖాన వెనుకాల ఉన్న రోడ్డులో అంతర్గత మురుగు కాలువ ఉంది. చెత్తా చెదారం నిండిపోవడంతో మురుగు నీరు పొంగి రోడ్డు మీద ప్రవహిస్తుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రజలు పేర్కొంటున్నారు. పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం వలనే ఈ దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రూ.10.50 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన**



ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లిగూడ చౌరస్తాలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిబట్ల, ఫిబ్రవరి 22: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లిగూడ చౌరస్తా నుంచి విజయవాడ హైవే వరకు సి.ఆర్.ఆర్ ఫండ్స్ కింద మంజూరైన రూ.10 కోట్ల 50 లక్షలతో 11 కిలోమీటర్ల వరకు రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మున్సిపాలిటీలో రూ.10 కోట్ల నిధులతో డీసీసీబీ జిల్లా కార్యాలయం ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీలో కోట్ల రూపాయలు కేటాయించి అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కొహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, నాయకులు బాల్‌రాజ్, రమేశ్, అశోక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**పేదలకు మెరుగైన వైద్యసేవలు**

ఇబ్రహీంపట్నం : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి సర్కారు బస్తీ దవాఖానలను అందుబాటులోకి తీసుకువస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బస్తీ దవాఖానను ఆయన అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తులో నియోజకవర్గంలో మరిన్ని బస్తీ దవాఖానలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

పెద్దఅంబర్‌పేట : అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన 145 మందికి రూ.1.63 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేశారు. శనివారం పెద్దఅంబర్‌పేటలోని ఇందిరాగార్డెన్‌లో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, హయత్‌నగర్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 26న మహ శివరాత్రిని పురస్కరించుకుని జరిగే జాతర కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, కమిషనర్ వెంట మేనేజర్ రాఘవేందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ చేవెళ్ల మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

- చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 22

## మార్చి 8న జాతీయలోక్ అదాలత్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి స్వరూప

ఆమనగల్లు, ఫిబ్రవరి 22: రాజీయే రాజమార్గం అని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి శనివారం జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప పోలీస్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకొని పోలీస్ కేసుల నుంచి విముక్తి పొందాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తిక్, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, సీఐలు ప్రమోద్‌కుమార్, వేణుగోపాల్, శివప్రసాద్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కడ్తాల్, ఫిబ్రవరి 22: తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. అనంతరం స్వపరిపాలనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు యాదయ్య, జ్యోతి, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మార్సీలో 2008డీఎస్సీ అభ్యర్థుల రిపోర్ట్

కేశంపేట, ఫిబ్రవరి 22: డీఎస్సీ - 2008లో ఉద్యోగం సాధించిన అభ్యర్థులు ఎమ్మార్సీలో రిపోర్ట్ చేసినట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008లో డీఎస్సీ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులను విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడంతో ప్రభుత్వం అభ్యర్థులను విధుల్లోకి తీసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేశంపేట మండలాన్ని ఎంపిక చేసుకున్న 10మంది ఉపాధ్యాయుల్లో ఇప్పటి వరకు 9మంది ఉపాధ్యాయులు రిపోర్ట్ చేశారని, ఒకరు వ్యక్తిగత కారణాలతో రాలేకపోయారన్నారు. రిపోర్ట్ చేసేందుకు 15రోజుల వ్యవధి ఉంటుందని, అతను త్వరలో రిపోర్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని, ఉపాధ్యాయుల రాకతో ఆయా పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు.

## పాఠశాలకు ప్రాజెక్టర్ బహూకరణ



పాఠశాలకు ప్రాజెక్టర్, ప్రింటర్‌ను అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షురాలు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 22: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు హైదరాబాద్ బుద్ధాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఉపేక్యమాతాజీ ప్రాజెక్టర్, ప్రింటర్‌ను ఎంఈవో మనోహర్ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హోప్ ఇన్‌చార్జి సుజాతబారువ సహకారంతో అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు అరుణకుమారి, నాగయ్య, గ్రామస్తులు సిద్దార్థ, లక్ష్మారెడ్డి, బాల్‌రాజు, అనిల్, ఉపాధ్యాయులు మన్నన్, గౌరీశ్వరి, దేవిప్రసూన, బ్రహ్మాచారి, రాజ్‌కుమార్, మల్లయ్య పాల్గొన్నారు.

## లైంగికదాడి యత్నం కేసులో వ్యక్తికి రిమాండ్


యాచారం, ఫిబ్రవరి22: మతిస్థిమితం లేని 70ఏళ్ల వృద్ధురాలిపై ఓ యువకుడు లైంగిక దాడి యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. మండలంలోని మాల్ మార్కెట్‌లో గత డిసెంబర్ 9న మతిస్థిమితంలేని వృద్ధురాలిపై లైంగికదాడి యత్నానికి పాల్పడిన యువకుడిని శనివారం యాచారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నరసింహారావు కథనం ప్రకారం..నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, ఎరుగండ్లపల్లికి చెందిన పోలే శ్రీశైలం (25) అనే యువకుడు మాల్‌లో ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం మాల్ ఎస్‌బీఐ వద్ద నిద్రిస్తున్న మతి స్థిమితం లేని వృద్ధురాలిపై లైంగికదాడికి యత్నించాడు. ఈ విషయం రెండు నెలల తరువాత వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న వృద్ధురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐదు రోజుల క్రితం కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బ్యాంకు సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నేరం అంగీకరించడంతో అతడిని రిమాండ్‌కు తరలించారు.



కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శనివారం కన్నుల పండువగ నిర్వహించారు. ఈ ఉత్సవంలో కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ కవిత దంపతులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

- కేశంపేట, ఫిబ్రవరి 22

## పశువైద్య విద్య వైపు యువత చూపు



వెటర్నరీ వీసీ జ్ఞానప్రకాశ్‌కు అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 22: పీవీ నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర పశు వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా జ్ఞాన ప్రకాశ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జ్ఞాన ప్రకాశ్ వరంగల్‌జిల్లా హసన్ పర్తి వాస్తవ్యులు. పశుజన్యుశాస్త్రం, బ్రీడింగ్ విభాగంలో పట్టా పొందారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు ప్రధాన కార్యాలయంలో పరిశోధనా సంచాలకులుగా, రిజిస్ట్రార్, వర్సిటీ అధికారిగా, మహబూబ్‌నగర్ , తిరుపతి వెటర్నరీ వర్సిటీల సహాయకులుగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పథకం ద్వారా 6 నెలలు యువతకు పశువుల పట్ల ప్రాథమిక దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల శిక్షణ ఇచ్చేందుకు కృషిచేయనున్నామన్నారు. యువత పశు వైద్య విద్యవైపు మొగ్గు చూపుతున్నారని , అందుకు అనుగుణంగా కళాశాలలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని పెంచేందుకు కృషి చేస్తామన్నారు.



## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

షాబాద్, ఫిబ్రవరి 22: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని రేగడిదోస్వాడ, మన్‌మర్రి, సర్దార్‌నగర్, మోడల్ స్కూల్, షాబాద్ బాలుర, బాలికల, తాళ్లపల్లి, పోతుగల్, హైతాబాద్, మాంటిస్సోరీ, నవజీవన్, ధ్యానహిత, శ్రీ చైతన్య, హోలీస్పిరిట్, కేజీబీవీ ఉన్నత పాఠశాలల్లో ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 860 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, కంపాక్స్ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదుగాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ అభిరామ్‌రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు అశోక్, కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచులు నర్సింహులు, రవీంద్రనాయక్, నాయకులు శేఖర్, ఆంజనేయులు, తౌసిఫ్, రఫీక్, దయాకర్, సూర్య, జంగయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలి




అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఫిబ్రవరి 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితో కమిషనర్ శరత్ చంద్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు వార్డులలో పారిశుధ్య నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్టైజ్‌మెంట్, పన్నుల వసూలు, స్వచ్ఛ సర్వేక్షణ తదితర అంశాలపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూలలో వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు.